ఇంటర్నేషనల్ కరాటేలో గోల్డ్ మెడల్



నారాయణగూడలోని వైఎంసీఏలో కృష్ణను సత్కరిస్తున్న ప్రిస్టిలీగైస్

హిమాయత్‌నగర్, మే 23: ఇటీవల మలేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ గోజు-రైయు, ఐపో సిటీ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో యమగుచ్చి కరాటే ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ ఆర్.కె.కృష్ణ మెరిట్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. నారాయణగూడలోని వైఎంసీఏలో గురువారం వైఎంసీఏ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ప్రిస్టిలీగైస్, ఆర్.కె. కృష్ణతో పాటు కారాటే విద్యార్థులను సత్కారించి అభినందించారు. కార్యక్రమంలో ప్రతినిధులు బీజే వినయ్‌స్వరూప్, కె.కృష్ణ, రోహిత్, అనన్య, నందిని పాల్గొన్నారు.



జోడి మసీదులోని అలీఖాన్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నిజాం నవాబ్ రౌనక్ యార్‌ఖాన్, మతపెద్దలు

ఏడో నిజాం సేవలు మరువలేనివి

హిమాయత్‌నగర్, మే 23: ఆధునిక భాగ్యనగరానికి అంకురార్పణ చేసిన ఏడో నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ జీవితం ఆదర్శమని తొమ్మిదవ నిజాం నవాబ్ రౌనక్ యార్‌ఖాన్ అన్నారు. ఉస్మాన్ అలీఖాన్ 58వ వర్ధంతి సందర్భంగా గురువారం కింగ్ కోఠి, జోడి మసీదులోని అలీఖాన్ సమాధి వద్ద చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మాన్ అలీఖాన్ హయాంలోనే హైదరాబాద్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అనేక కట్టడాలు చెక్కు చెదరకుండా ఉన్నాయని, వందేండ్లు ప్రజలకు ఉపయోగపడే అన్ని సౌకర్యాలను కల్పించారని పేర్కొన్నారు. విభిన్న సాంస్కృతిక, మత సంప్రదాయాలకు ప్రతీకగా మీర్ ఉస్మాన్ అలీఖాన్ సేవలు చరిత్రలో నిలిచిపోతాయని ఆయన చెప్పారు. ప్రార్థనల్లో పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.

మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డితో పాటు పార్టీ సీనియర్ నేతలు ధన్‌రాజ్ రాథోడ్ సత్యనారాయణ, యాదగిరి ముదిరాజ్, నర్సింహ, బల్లు రాథోడ్‌తో తదితరులు గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకుడు వి.నవీన్‌యాదవ్ మంత్రిని శాలువతో సత్కరించి పూలమొక్కను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

– బంజారాహిల్స్/జూబ్లీహిల్స్

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

మల్కాజిగిరి, మే 23: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకొని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ కథనం ప్రకారం... మచ్చ బొల్లారం సాయి రెసిడెన్సీకి చెందిన రాణాప్రతాప్ సింగ్(33) సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై ఉద్యోగానికి వెళ్లడం మానేశాడు. ఇతనికి భార్య, బాబు ఉన్నారు. వారం క్రితం వేసవి సెలవులకు భార్యతో పాటు బాబు నాందేడ్‌కు వెళ్లారు. మద్యానికి బానిసైన రాణాప్రతాప్‌సింగ్ మానసికంగా ఆవేదన చెందుతున్నాడు. మానసిక ఒత్తిడితో మంగళవారం తన ప్లాట్‌లో మద్యం తాగి మత్తులో నీళ్లలో బ్లీచింగ్ ఫౌడర్ కలుపుకుని తాగాడు. తర్వాత అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న బంధువుల వద్దకు వెళ్లి వాంతులు, వీరోచనాలు చేసుకున్నాడు. బంధువులు ఏమైయిందని ప్రశ్నించడంతో నీళ్లలో బ్లీచింగ్ ఫౌడర్ కలుపుకుని తాగానని తెలిపాడు. వెంటనే వారు చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి సమీర్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ, మే 23: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శాంతినగర్‌లోని ఉండే మహమ్మద్ సాధిక్ (42)కు ప్రైవేట్ ఉద్యోగి. పదహారు ఏండ్ల క్రితం పెండ్లయ్యింది. ఈ నెల 16న సాయంత్రం తన మొబైల్ ఫోన్ చార్జింగ్ పెట్టాలని భార్యతో చెప్పి, ఇప్పుడే వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. సాధిక్ తిరిగి రాకపోవడంతో కంగారు పడిన తరనమ్ చుట్టపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. బంధువులు, సన్నిహితులతో వాకబు చేసినా అతడి ఆచూకీ తెలియరాలేదు. దాంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గురువారం రచయిత అంజన గోలి రచించిన బెటర్ ట్రాజెక్టరీస్ గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్యావధాని శంకర నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆమెరికాలో సేవా కార్యక్రమాల నిర్వహణతోపాటు వ్యక్తిత్వ వికాస వ్యాస రచన, సాహిత్య రంగాల్లో రాణిస్తున్న అంజన గోలి ప్రశంసనీయురాలని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, రాయారావు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. – ముషీరాబాద్

అక్రమ నిర్మాణాలపై.. ఉక్కుపాదం

కూల్చివేతలు షురూ..

రెండు భవనాల్లో అదనపు అంతస్తుల కూల్చివేత

మొండిగా వ్యవహరించే నిర్మాణదారులపై కేసులు నమోదు చేస్తాం

పంచవటికాలనీలో నేడు కూల్చివేతలు: టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్

అల్కాపూర్ టౌన్‌షిప్‌కాలనీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అల్కాపూర్ టౌన్‌షిప్‌కాలనీలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన మున్సిపల్ సిబ్బంది

మణికొండ, మే 23: మణికొండ మున్సిపాలిటీల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. కొన్నాళ్లుగా అక్రమ నిర్మాణాల జాతర యథేచ్ఛగా కొనసాగుతుండటంతో స్థానికుల నుంచి ఉన్నతాధికారులకు వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ నేతృత్వంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని రోడ్డు నంబరు 29లో అక్రమంగా వెలిసిన రెండు భవనాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తులను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేశారు. కొన్నిరోజులుగా అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేసినా పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తూ నిర్మాణాలు చేపట్టిన భవనాలను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. అల్కాపూర్ టౌన్‌షిప్‌కాలనీలోని రామాలయం ముందు ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని ప్రజలు ఫిర్యాదు చేసినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా పుప్పాలగూడ, నెక్నాంపూర్ గ్రామాల పరిధిలోని పలు కాలనీల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను త్వరలోనే కూల్చివేస్తామని వెల్లడించారు. పంచవటికాలనీలో నేడు(శుక్రవారం) కూల్చివేతలు చేపట్టనున్నామని టీపీవో సంతోష్‌సింగ్ తెలిపారు. మణికొండ మున్సిపాలిటీలో చాలా చోట్ల అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నట్లు తమ దృష్టి వచ్చాయని వాటిని గుర్తించి నోటీసులు జారీ చేశామని అన్నారు. అయినా మొండిగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో ఆర్ట్ ఎ గైనిస్ట్ క్యాన్సర్ పెయింటింగ్ ప్రదర్శన తిలకిస్తున్న వైద్యులు

మూత్రాశయ క్యాన్సర్‌పై..

పెయింటింగ్ ఎగ్జిబిషన్

బంజారాహిల్స్,మే 23: బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో ఆమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో మూత్రాశయ క్యాన్సర్‌పై 'ఆర్ట్ ఎ గైనిస్ట్ క్యాన్సర్' పేరుతో నిర్వహించిన పెయింటింగ్ ప్రదర్శన గురువారం ముగిసింది. ప్రతియేటా మే నెలను మూత్రాశయ క్యాన్సర్ అవగాహనగా పాటిస్తారు. దవాఖాన మెడికల్ ఆంకాలజీ వైద్యుడు సెంథిల్ రాజప్ప తెలిపారు. ప్రతియేటా లక్షలాది మంది వ్యాధి బారిన పడుతున్నారని, సరైన అవగాహన లేక ప్రారంభదశలో క్యాన్సర్‌ను గుర్తించలేక పోతున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిత్రకారులు విభిన్నమైన చిత్రాలు వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీఈవో డాక్టర్ కూరపాటి కృష్ణయ్య, డాక్టర్ ఎంవీటీ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఎర్రగడ్డ, మే 23: బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్ హరిహర క్షేత్ర దేవస్థానంలో మూడు రోజులుగా కొనసాగిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజు వివిధ బస్తీల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. సుదర్శన హోమం, విష్ణుసహస్రనామ పారాయణంతో పాటు వివిధ కార్యక్రమాలు జరిగాయి. ఆధ్యాత్మిక కేంద్రంగా పేరున్న హరిహర క్షేత్ర దేవస్థానంలో ఉన్న వివిధ స్వాముల వారి ఆలయాల అభివృద్ధితో పాటు భక్తులకు సకల వసతులు ఉండేలా చేస్తామని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కల్వల సత్యనారాయణరావు పేర్కొన్నారు. సుదర్శన హోమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హరిహర క్షేత్ర దేవస్థానంలో సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

న్యాయం చేయండి...

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న హబీబ్ అహ్మద్ ఖాన్

హిమాయత్‌నగర్, మే 23: తనకు వక్ఫ్‌బోర్డు కేటాయించిన స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితుడు హబీబ్ అహ్మద్‌ఖాన్ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నాడు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుమయూన్ నగర్‌కు చెందిన బాధితుడు హబీబ్ అహ్మద్ ఖాన్, హైకోర్టు న్యాయవాది ఖాజాఅర్షన్ అహ్మద్‌తో కలిసి మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా, యాదిరా మండలం, అప్పన్నపల్లి గ్రామంలోని వక్ఫ్‌బోర్డుకు సంబంధించి సర్వే నం.242, 243లో ఉన్న 10ఎకరాల 19 గుంటల భూమిని 2023 జూలై మాసంలో ఒక ఏడాదికి తాను లీజ్‌కు తీసుకున్నానని తెలిపారు. ఈ భూమిలో కోల్డ్ స్టోరేజ్, వర్టికల్ ఫార్మింగ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకుని స్థలం వద్దకు వెళ్లగా అక్కడ అదే ప్రాంతానికి చెందిన శ్రీశైలం, సంజీవులు ఆ స్థలాన్ని అక్రమంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. కబ్జాదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకుని తనకు అప్పగించాలని స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లినా.. స్పందించక పోవడంతో తాను కోర్టును ఆశ్రయించానని చెప్పారు. కోర్టు తనకు అనుకూలంగా తీర్పు నిచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి వక్ఫ్‌బోర్డు కేటాయించిన స్థలాన్ని తనకు అప్పగించి న్యాయం చేయాలని కోరారు.

24 నుంచి కాచిగూడలో ఉచిత వైద్యశిబిరం

కాచిగూడ, మే 23 : శ్రీ శ్యామ్‌మందిర్ సేవా సమితి ఆధ్వర్యంలో కాచిగూడ శ్రీ శ్యామ్‌బాబా మందిర్‌లో ఈ నెల 24 నుంచి 31 వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆధునిక పరికరాలతో పక్షవాతంతో బాధపడేవారికి ఫిజియోథెరిపీతో పాటు కిట్స్ ఉచితంగా అందిస్తున్నట్లు హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు తెలిపారు. పూర్తి వివరాలకు 9949238492 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బడుల బాధ్యతలు మహిళా సంఘాలకు

- అభివృద్ధి పనులు, యూనిఫాంలు సిద్ధం చేసేందుకు ఏర్పాట్లు

జూబ్లీహిల్స్, మే 23: పొదుపు మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా నూతన విద్యా సంవత్సరానికి గాను అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు అధికారులు శ్రీకారం చుడుతున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులతో పాటు విద్యార్థుల యూనిఫాం బాధ్యతలు మహిళా సంఘాలకు అప్పగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బడుల ప్రారంభానికి సమయం దగ్గరపడుతుండడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఖైరతాబాద్ జోన్ పరిధిలో పొదుపు సంఘాల మహిళలతో పాఠశాలల అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఉన్న సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం సిద్ధం చేసే బాధ్యతను అప్పగించనున్నారు. ఈ మేరకు పొదుపు సంఘాల్లో ఎక్కువగా టైలరింగ్ వృత్తిపై ఆధారపడే మహిళలతో పాటు కుట్టుపని వచ్చిన మహిళలందరినీ ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వాములను చేయనున్నారు. అంతేకాకుండా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పొదుపు సంఘాల మహిళలకు పాఠశాలల్లో మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్ ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించి స్కూల్ బాధ్యతలు అప్పగించనున్నట్లు యూసీడీ డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వృత్తి సంఘాల నాయకులు

చిక్కడపల్లి, మే 23 : స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్‌లో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేసి బీసీల అన్ని తరగతులకు రిజర్వేషన్లు అందించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వివిధ వృత్తి సంఘాల ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్‌లో ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, ప్రొఫెసర్ భాగయ్య తదితరులు హాజరై మాట్లాడారు. మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోరిగల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు విగ్నేశ్, వెంకట కృష్ణ, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కుమారస్వామి, బోయ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మీనంగిరి గోపి, సుధాకర్, జంపాల రాజేశ్, బాల రాజు, ఏఎల్ సుధాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, నినదిస్తున్న నాయకులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అత్తాపూర్, మే 23: చార్మినార్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎంగూడ యూజీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు అత్తాపూర్, సీబీఐటీకాలనీ, సోమిరెడ్డినగర్, ఏషియన్ థియేటర్, పటేల్ హోటల్, వీకర్‌సెక్షన్‌కాలనీ, అత్తాపూర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 వరకు ఈశ్వర్ థియేటర్, హైదర్‌గూడ, గాంధీ విగ్రహం, కాంతారెడ్డినగర్, రాధాకృష్ణానగర్, అంబియన్స్‌ఫోర్ట్,

జనప్రియ ఏబీ కేబుల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేశవనగర్, కృష్ణానగర్, శివానగర్, మోర్ సూపర్‌మార్కెట్, గుమ్మకొండకాలనీ ప్రాంతాల్లో మరమ్మతుల నిమిత్తం కోత విధిస్తున్నామన్నారు.

ఇండ్లులేని నిరుపేదలకు స్థలాలివ్వాలి

హిమాయత్‌నగర్, మే 23: రాష్ట్రంలో ఇండ్లులేని నిరుపేద దళితులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ జూన్ 10న అన్ని జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 18 నుంచి 20వ తేదీ వరకు భువనగిరి యాదాద్రి జిల్లాలో డీహెచ్‌పీఎస్ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు డీహెచ్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

గుర్తుతెలియని మహిళ మృతి

గుర్తు తెలియని మహిళ మృతదేహం

వెంగళరావునగర్, మే 23: గుర్తుతెలియని మహిళ మృతి చెందిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సీహెచ్ శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం... సనత్‌నగర్‌లోని స్వామి థియేటర్ సమీపంలోని కల్లుకాంపౌండ్ సమీపంలో సుమారు 40 సంవత్సరాల మహిళ అపస్మారక స్థితిలో ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్ ద్వారా మహిళను గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి...

కాచిగూడ,మే 23: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ మక్సూద్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(50) బుద్వేల్-ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య గురువారం రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు బూడిది రంగు చొక్కా, నల్ల రంగు ప్యాంట్ ధరించి, 5.2అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ కోసం 9912221985 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో ఒకరు..

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(30) గురువారం సీతాఫల్‌మండీ రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు పింక్ టీషర్ట్, నీలిరంగు జీన్స్ ధరించి, 5.6 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 81438 07592 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అకోలా రైలులో చోరీ

కాచిగూడ,మే 23: అకోలా రైలులో ఇద్దరి ప్రయాణికుల బంగారు ఆభరణాలు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. ముషీరాబాద్‌కు చెందిన ఆత్మభాను(41)అకోలా రైలులో కాచిగూడకు వస్తుండగా కర్కేలి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు 2.5 బంగారు ఆభరణాలు, రూ.2 వేల నగదు, ఫోన్‌ను దొంగిలించారు. అల్వాల్‌కు చెందిన నారాయణ్ రామ్(46)అదే రైల్లో కాచిగూడకు వస్తుండగా కర్కేలి స్టేషన్ సమీపంలో దుండగులు రూ.38 వేల నగదు, తులం బంగారు ఆభరణాలు దొంగిలించారు. గురువారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.